క్లుప్తంగా

మర్యాద పూర్వకంగా..



కలెక్టర్ మాధవీలతను కలిసిన డీఎస్పీ అంబికా ప్రసాద్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం సౌత్ జోన్ డీఎస్పీగా బదిలీపై వచ్చిన ఎం.అంబికా ప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టిన అనంతరం కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ మాధవీలతను మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. 1991 బ్యాచ్‌కు చెందిన అంబికా ప్రసాద్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి ఇక్కకు బదిలీపై వచ్చారు.

పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం



సమావేశంలో పాల్గొన్న సభ్యులు

కడియం: జేగురుపాడులోని ఫెలోషిప్ వర్కింగ్ ప్రెసిడెంట్ డి.పరంజ్యోతికి చెందిన పేతురు మెమోరియల్ ప్రార్థనా మందిరంలో సోమవారం కడియం మండల పాస్టర్స్ ఫెలోషిప్ సర్వసభ్య సమావేశం జరిగింది. వర్తమానికులు డాక్టర్ కె.శ్యామ్‌కుమార్ వాక్యసందేశాన్నందించారు. కార్యక్రమంలో ఫెలోషిప్ ప్రెసిడెంట్ ఎం.కరుణాకర్, గౌరవాధ్యక్షుడు కె.జయశీల్ మాట్లాడారు. సెక్రటరీ రత్నదీప్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డి.రత్నరాజు, బిషప్ సాలోమోను, ఎలీషా, జీవరత్నం పాల్గొన్నారు.

సువర్ణవేణికి విద్యారత్న అవార్డు



పురస్కారం అందుకుంటున్న డాక్టర్ సువర్ణవేణి

కడియం: స్థానిక హైస్కూల్ ఉపాధ్యాయురాలు డాక్టర్ బూసి సువర్ణవేణి విద్యారత్న నేషనల్ అవార్డు 2024ను అందుకున్నారు. ఈ వివరాలను సోమవారం ఆమె స్థానిక విలేకరులకు తెలిపారు. సౌత్ ఇండియా బహుజన రైటర్స్ 7వ నేషనల్ కాన్ఫరెన్స్ ఇటీవల తిరుపతిలో జరిగింది. ఈ కార్యక్రమంలో సువర్ణవేణిని పురస్కారంతో సత్కరించారు. బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ యు.సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా పురస్కారాన్ని అందజేశారు. విద్యారంగంలో ఆమె చేస్తున్న సేవా కార్యక్రమాలకు గాను ఈ గౌరవం దక్కింది. ఈ సందర్భంగా సువర్ణవేణిని స్కూల్ హెచ్ఎం సత్యనారాయణ, కార్యదర్శి జి.సత్యనారాయణ, ఎస్ఎంసీ చైర్మన్ ఎస్.లక్ష్మి, సిబ్బంది అభినందించారు.

వసతుల పరిశీలన

కంబాలచెరువు: స్థానిక గౌతమీ జీవ కారుణ్య సంఘాన్ని సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి సందర్శించి, అక్కడి వసతులను పరిశీలించారు. నివాస గదులు, పరిసరాలు, వంటశాలను పరిశీలించి, వృద్ధులకు అందిస్తున్న ఆహారాన్ని రుచి చూశారు. అనంతరం కేవీ స్టేట్ హోమ్‌ను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. క్రమశిక్షణ పాటిస్తూ మంచిగా చదువుకోవాలన్నారు. హోంలో ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం భోజనం అందించాలని అక్కడి అధికారులను, సిబ్బందిని ఆదేశించారు.

యూటీఎఫ్ నిరసన

కంబాలచెరువు: డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లో అప్రెంటిస్ విధానాన్ని ప్రవేశ పెడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌ను ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) వ్యతిరేకిస్తోందని ఆ సంఘ నాయకులు ఎస్.అరుణకుమారి, ఎ.షరీఫ్ అన్నారు. గోకవరం బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం నిరసన తెలిపారు.

సమస్యల సాధనకై పోరాటం

కంబాలచెరువు: స్థానిక ఏపీ ఎన్జీవో అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల జేఏసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ వీవీఎస్ నాయుడు, కన్వీనర్ ఎస్.ప్రవీణ్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి డి.వేణుమాధవరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల సమస్యల సాధనకు పోరాటం సాగించాలన్నారు.

జయహో బీసీ

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని నరసింహరాజు కల్యాణ మండపంలో టీడీపీ మండల అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్ అధ్యక్షతన సోమవారం జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ తొలుత నుంచీ బీసీలకు అండగా నిలిచిన పార్టీ తెలుగుదేశమన్నారు. జగన్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ముందుగా జ్యోతిరావు పూలే, ఎన్టీఆర్ చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు.

సాహిత్య చుక్కాని.. కళాగౌతమి

- కవులు, రచయితలకు ప్రోత్సాహం
- ప్రతినెలా రెండో ఆదివారం సమావేశం



రచయితల సమితి సమావేశంలో మాట్లాడుతున్న బీవీఎస్ మూర్తి తదితరులు

సీటీఆర్ఐ: బంగారం పళ్లానికైనా గోడ చేర్పు అవసరం అన్న సామెత చందంగా ఎంత కవి అయినా, రచయిత అయినా ప్రోత్సహించేవారు లేకపోతే వారి ప్రతిభ వృథాగా మారుతుంది. కళాకారులకు కావాల్సిన చప్పట్లు లేకపోతే వారికి ఉత్సాహం రాదు. నలుగురూ తమ రచనలను, కవితలను మెచ్చుకుంటేనే వారి ఉత్సాహం రెట్టింపు అవుతుంది. పూర్వం రాజులు కళలు, సాహిత్యాలను ప్రోత్సహించేవారు. ప్రస్తుతం అది కనుచూపు మేరలో లేదు. అందువల్లనే కవులు, కళాకారులు తమకు తామే సంఘాలుగా ఏర్పడి, తమ ప్రతిభాపాటవాలను చాటుకుంటున్నారు.

సారస్వత రాజధాని

రాజమహేంద్రవరం తెలుగువారికి సారస్వత రాజధాని. కవిసార్వభౌములకు ఇది నిలయం. తెలుగునాట కవి సార్వభౌములుగా ప్రసిద్ధి చెందిన శ్రీనాథుడు, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి, కూచిమంచి తిమ్మకవి.. ముగ్గురూ ఈ గోదావరి నీరు తాగిన వారే కావడం విశేషం. కానీ నేడు క్రమంగా గోదావరి తీరంలో కవులు, రచయతలు కనుమరుగవుతున్నారు. నగరంలో కొందరు పాత తరం వారు ఇంకా వారిలోని జిజ్ఞాసను కొనసాగిస్తూ నేటి తరానికి వారిధిగా ఉంటున్నారు.

2004 రచయితల సమితి ప్రారంభం

రచయితలను ఒకచోట సమావేశ పరిచి, వారిని సమర్థులైన రచయితలుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో కళాగౌతమి వ్యవస్థాపకుడు బీవీఎస్ మూర్తి 2004లో రాజమహేంద్రవరంలో రచయితల సమితిని ప్రారంభించారు. అప్పటి నుంచి నిరంతరంగా ప్రతి రెండో ఆదివారం కవులు, రచయితలతో సమావేశం జరుగుతోంది. నగరంలోని రచనాసక్తి కలిగిన వారిని ఒకచోట చేర్చి, వారిని ప్రోత్సహించి, తప్పులను సరిచేసి చక్కని రచయితలుగా తయారు చేయడంలో కళాగౌతమి అవిశ్రాంతిగా పరిశ్రమిస్తోంది. తెలుగు రచయితల సమితి రెండు దశాబ్దాలుగా కవులను, రచయితలను ఒక్కచోటకు చేర్చి.. ప్రతి రెండో ఆదివారం కవి సమ్మేళనాలు, పుస్తక పరిచయాలు, సమీక్షలు, సమకాలీన అంశాలపై రచనలను దిగ్విజయంగా నిర్వహిస్తోంది. ప్రాచీన సాహిత్యం నుంచి ఆధునిక కవిత ప్రక్రియల్ని ప్రోత్సహిస్తూ, ముందుకు సాగుతున్న సంస్థగా దినదిన ప్రవర్ధమానం అవుతోంది.

రచయితల సమితికి నీడ లేదు

రచయితల సమితికి సరైన వేదిక లేదు. 2004లో పురమందిరంలో ప్రారంభించబడి, వివిధ వేదికలకు మారింది. సమరయోధుల పార్కు, దానవాయిపేట మున్సిపల్ ఉన్నత పాఠశాల, అక్కడి నుంచి స్టేడియం వద్ద గల మున్సిపల్ ప్రాథమిక పాఠశాల, ధర్మరచ కమ్యూనిటీ హాలు, రౌండ్ పార్కులోకి.. ఇలా పలుచోట్ల తిరిగి ఇప్పుడు ఎస్‌కేవీటీ కళాశాలలోని కందుకూరి నాటక నిలయం వద్దకు చేరుకున్నాం.

– బీవీఎస్ మూర్తి, కళాగౌతమి వ్యవస్థాపక అధ్యక్షుడు

కొత్త రచయితలకు వెన్నుదన్ను



కవిత్వాలు రాయాలి, రచనలు చేయాలని అనుకునే వారికి రచయితల సమితి ఒక వేదికగా నిలుస్తోంది. సాహిత్యానికి పుట్టినిల్లు అయిన రాజమహేంద్రవరంలో కవులకు, కళాకారులకు ఓ చక్కని వేదిక అందించాలని ఉద్దేశంతో ఈ రచయితల సమితిని ఏర్పాటు చేయడం జరిగింది. అక్షర జ్ఞానం, భాషాభిమానం ఉన్న ప్రతి ఒక్కరూ ఈ వేదికను ఉపయోగించుకోవాలి. వారి రచనలు, కవితలను, కళలను, ప్రతిభా పాటవాలను ప్రదర్శించడానికి సరైన వేదిక ఇదే.

– డాక్టర్ పీవీబీ సంజీవరావు, కళాగౌతమి అధ్యక్షుడు

పండగ వాతావరణం



ప్రతి నెలా రెండో ఆదివారం ఎన్ని పనులున్నా రచయితల సమితి కార్యక్రమాలకు వెళ్లడానికి సిద్ధమవుతాం. ఎప్పుడెప్పుడు రెండో ఆదివారం వస్తుందా, కొత్త కవితలను, రచనలను వింటామా, వినిపిస్తామా అని మనసు తహతహలాడుతుంది. సమకాలీన అంశాలను ముందుగా తెలియజేసే కవులను సమావేశపరిచి కవి సమ్మేళనాన్ని జరిపించడం, అవధానాలు చేయించడం మరువలేని అనుభూతి. అది పండగ వాతావరణాని తలపిస్తుంది.

– డాక్టర్ బీహెచ్ రమాదేవి, రచయిత్రి

తోటి రచయితల నుంచి ప్రేరణ



కొత్తగా రచనలు చేసే వారితో పాటు, ప్రతి భావంతులైన కవుల వరకూ ఒక చోట చేరి, విశేషంగా సమకాలిన అంశాలపై స్పందిస్తూ తమ రచనలు వినిపించడం అభినందనీయం. అందరినీ ప్రోత్సహించడానికి, ఎదుగుదలకు ఏర్పర్చిన చక్కని సాహితీ వేదిక తెలుగు రచయితల సమితి. ఆ సమితి సభ్యుడిగా నేను పొందిన ప్రేరణ మరువలేనిది.

– ముంగటి సూర్యనారాయణ, కవి రచయిత

శివరాత్రికి గోదావరి ఘాట్లను సిద్ధం చేయాలి



కోటిలింగాల ఘాట్‌ను పరిశీలిస్తున్న టీకే విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు గోదావరి ఘాట్లను సిద్ధం చేయాలని రాజమహేంద్రి గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆయన సోమవారం స్థానిక కోటిలింగాల ఘాట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఘాట్లలో మెట్లపై ఉన్న మట్టిని తొలగించాలని, మెట్ల దగ్గర నుంచి గోదావరి నీటి వరకూ ఐదు అడుగుల సిమెంట్ ప్లాట్‌ఫాం నిర్మించాలన్నారు. భక్తులకు అనుకూలంగా గట్లపై భాగాల్లో సులభ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేయాలని, బ్రాహ్మణుల సంఘ భవనానికి విద్యుత్తు కనెక్షన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ సిబ్బంది, గోదావరి పరిరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఆర్‌సీఎం చర్చిలో ప్రార్థనలు

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి ఆర్‌సీఎం చర్చిలో సోమవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాదర్ మనోజ్ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి ప్రారంభమవుతున్న తపస్సు కాలాన్ని ఉపవాస ప్రార్థనలతో నిష్ఠగా నిర్వహించాలన్నారు. 40 రోజుల పాటు జరిగే ఉపవాస ప్రార్థనల్లో క్రైస్తవులందరూ బైబిల్ పఠనం చేయాలన్నారు. ఏసుక్రీస్తు అనుభవించిన శ్రమలకు గుర్తుగా చేస్తున్న తపస్సు కాలాన్ని పవిత్రంగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపదేసి రాయి థామస్ తదితరులు పాల్గొన్నారు.

ఒంటరి పోటీకి టీడీపీ సిద్ధమేనా!



మహిళతో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

- ప్రశ్నించిన ఎంపీ, సిటీ కోఆర్డినేటర్ భరత్‌రామ్
- నగరంలో ఉత్సాహంగా గుడ్ మార్నింగ్ కార్యక్రమం

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి జగన్ ఏమి చేస్తే దానికి తెలుగుదేశం పార్టీ సిద్ధమంటోందని, ఆ ప్రకారం వైఎస్సార్ సీపీ మాదిరిగా రాష్ట్రంలోని 175 స్థానాల్లో ఒంటరిగా పోటీ చేసేందుకు టీడీపీ సిద్ధమేనా అని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ మార్గాని భరత్‌రామ్ ప్రశ్నించారు. ఆయన సోమవారం స్థానిక 44వ డివిజన్ పనస చెట్టు, మూడు గుళ్ల రామాలయం పరిసరాల్లో గుడ్ మార్నింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలున్నాయా అని ప్రశ్నించారు.

విద్య, వైద్యం, సంక్షేమానికి ప్రాధాన్యం

ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం విద్య, వైద్యం, సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. దానిపై చర్చకు టీడీపీ సిద్ధమా అని ప్రశ్నించారు. నగరంలో రెండు దశాబ్దాలుగా అధికారంలోకి ఉన్న టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఏమి అభివృద్ధి చేశారో వివరించాలన్నారు. 2014లో కేంద్రంలోని ఎన్డీఏలో భాగస్వామిగా ఉన్న టీడీపీ.. రాష్ట్రంలో ఏ విధమైన అభివృద్ధికి కృషి చేసిందో చెప్పడానికి సిద్ధం కావాలన్నారు. రాజకీయ ముసుగులో వడ్డీ, చిట్టీ వ్యాపారాలతో ప్రజలను బెదిరించడం తప్పిస్తే.. వారు చేసిందేమీ లేదన్నారు. ఈ ఐదేళ్లలో నగరానికి, ప్రజలకు ఏ విధంగా సేవలందించారో ప్రజల ముందు చర్చించేందుకు వారు సిద్ధమైతే, అందుకు మేమూ సిద్ధమే అన్నారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, పార్టీ నగర మహిళా విభాగం అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, మాజీ కార్పొరేటర్ అర్జరపు వాసు, హసీనా బేగం పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

- మంత్రి, రూరల్ కో ఆర్డినేటర్ వేణు
- ధవళేశ్వరం ఎర్రకొండపై పర్యటన



ధవళేశ్వరం ఎర్రకొండపై పర్యటిస్తున్న మంత్రి వేణు

ధవళేశ్వరం: గ్రామంలోని ఎర్రకొండలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. స్వచ్ఛత మన బాధ్యత గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో భాగంగా మంత్రి వేణు సోమవారం ఆ ప్రాంతంలో అధికారులు, స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. పారిశుద్ధ్యం మెరుగు, తాగునీటి సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులకు సూచనలు జారీ చేశారు.

ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

మంత్రి వేణు మాట్లాడుతూ ప్రస్తుతమున్న తాగునీటి ఓవర్ హెడ్‌ట్యాంక్‌కు అదనంగా మరో ట్యాంక్ నిర్మాణానికి అవసరమయ్యే వ్యయప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ధవళేశ్వరానికి గోదావరి నుంచి తాగునీరు సరఫరా చేసే రక్షిత తాగునీటి పథకం మరమ్మతులకు రూ.40 లక్షల అవసరమవుతుందని, ఆ మేరకు ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారన్నారు. నిధులు రాగానే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ ప్రాంత ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీటిని అందించేందుకు మరో అదనపు ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం అవసరమవుతుందని, దానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

ఇంటింటికీ వెళ్లి..

మంత్రి వేణు ధవళేశ్వరం ఎర్రకొండ ప్రాంతంలోని ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి, వారి బాగోగులు తెలుసుకున్నారు. స్వచ్ఛత మన అందరి బాధ్యతని, శుభ్రతను పాటించడం వల్ల ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. గ్రామంలోని పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామంలో మట్టికుండలు తయారు చేసి విక్రయిస్తున్న మహిళతో మాట్లాడి, ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ టి.శ్రీనివాస్ బాబు, జేఈ బి.శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి డి.సూరిబాబు, జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ షబ్బర్ బాషా, వైఎస్సార్ సీపీ నాయకులు బొడ్డేటి శివాజీ, బోడపాటి కుమార్, గొన్న సత్తిబాబు, పెన్నాడ లక్ష్మి, దేవులపల్లి సరితారాణి, ఎస్వీ శేఖర్, రేగుళ్ల రాజు, పట్టపగలు వెంకటలక్ష్మి, ధర్మ, అమ్ములు తదితరులు పాల్గొన్నారు.

‘స్పందన’ అర్జీలకు సత్వర పరిష్కారం



అర్జీదారులతో మాట్లాడుతున్న కమిషనర్ దినేష్ కుమార్



అర్జీలు స్వీకరిస్తున్న కేఆర్‌సీ తహసీల్దార్ సత్యనారాయణరాజు

రాజమహేంద్రవరం సిటీ: స్పందన కార్యక్రమానికి వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా సత్వర పరిష్కరిస్తున్నట్టు కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్ అన్నారు. నగరపాలక సంస్థలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి 26 అర్జీలను స్వీకరించారు. కమిషనర్ మాట్లాడుతూ అర్జీల విషయంలో అధికారులు, సిబ్బంది జవాబుదారీతనంతో సేవలు అందించాలన్నారు. కాగా.. సింహాచలం నగర్‌లోని క్వారీ నుంచి వచ్చే నుసి వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని మాజీ కార్పొరేటర్ బర్రే కొండబాబు ఫిర్యాదు చేశారు. క్వారీ మార్కెట్ ఏరియాలో తాగునీటి కుళాయి కనెక్షన్లు ఇప్పించాలని కె.సత్యనారాయణ, సంజీవ నగర్‌లో అక్రమంగా నిర్మిస్తున్న భవనాన్ని తొలగించాలని డి.రామస్వామి అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, ఎస్ఈ జి.పాండురంగారావు, సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

త్వరితగతిన పరిష్కరించాలి

సీటీఆర్ఐ: రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కోనేరు రంగారావు కమిటీ (కేఆర్‌సీ) తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ రాజు అన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఆర్డీవో తరఫున ఆయన పాల్గొని, ప్రజల నుంచి 14 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం స్పందన కార్యక్రమంతో పాటు జేకేసీ కూడా ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ పరిపాలన అధికారి జీఏఎల్ఎస్ దేవి పాల్గొన్నారు.

వేమగిరిలో మెగా వైద్య శిబిరం

- 1400 మందికి వైద్య సేవలు
- కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి వేణు



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి వేణు, చిత్రంలో రావిపాటి తదితరులు

కడియం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావిపాటి రామచంద్రరావు పుట్టినరోజును పురస్కరించుకుని వేమగిరిలో సోమవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. రాజమహేంద్రవరంలోని ప్రముఖ ఆసుపత్రుల నుంచి వచ్చిన జనరల్, న్యూరో, కంటి, ఆర్థోపెడిక్ విభాగాలకు చెందిన వైద్యులు శిబిరంలో సుమారు 1400 మందికి వైద్య పరీక్షలు చేశారు. ముందుగా శిబిరాన్ని మంత్రి వేణుగోపాలకృష్ణ ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతంలో నిపుణులైన వైద్యులతో శిబిరాన్ని నిర్వహించడంపై రావిపాటిని మంత్రి వేణు అభినందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేశారు. శిబిరం వద్దకు భారీగా విచ్చేసిన వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా స్థానిక యువత సేవలందించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, వివిధ గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు చీరల పంపిణీ

ఎంపీ భరత్‌రామ్, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, పార్లమెంట్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరై, పేదలకు చీరలు పంపిణీ చేశారు.

నేడు కడియం మండలంలో మంత్రి పర్యటన

జేగురుపాడు, వేమగిరి, కడియం పంచాయతీల పరిధిలో మంగళవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పర్యటించనున్నారు. ఉదయం 9 నుంచి ప్రారంభమయ్యే ఈ పర్యటనలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారు. ఈ మేరకు పార్టీ రాష్ట్రకార్యదర్శి గిరజాల వీర్రాజు, మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ సోమవారం సంయుక్తంగా ప్రకటన విడుదల చేశారు. కడియం గోశాల వద్ద నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా జేగురుపాడు పాములమెట్ట కాలనీలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తారు. అనంతరం కడియం సుబ్బారావుపేటలో అంగన్‌వాడీ కేంద్రం, ఎస్సీ పేటలో వాలీబాల్ గ్రౌండ్ ప్రహరీ, వేమగిరి జక్కంపూడి నగర్‌లో డాక్టర్ రాజశేఖరరెడ్డి, జక్కంపూడి రామ్మోహనరావుల విగ్రహాలను ప్రారంభిస్తారు. కడియం ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శిస్తారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మల్టీపర్పస్ సెంటర్‌లో అదనపు పనులు ప్రారంభిస్తారు. అరుంధతీపేటలో డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ మల్టీపర్పస్ సెంటర్, రైతు బజార్, హైస్కూల్లో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, క్రికెట్ ప్రాక్టీస్ నెట్, వాలీబాల్ కోర్టు పనులను ప్రారంభిస్తారు.

బ్యాంక్‌ను మోసగించిన ఇద్దరికి జైలు

విశాఖ లీగల్: బ్యాంక్‌ను మోసగించిన ఇద్దరికి ఐదేళ్ల జైలుతో పాటు రూ.22 వేల జరిమానా విధిస్తూ నగరంలోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం –1 న్యాయమూర్తి సీఎస్‌మూర్తి సోమవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలన్నారు. వివరాలు ఇవీ.. సత్య శివరామ శర్మ రాజమహేంద్రవరం రూరల్ మండలం ధవళేశ్వరం సిండికేట్ బ్యాంక్‌లో సీనియర్ మేనేజర్‌గా పనిచేసేవాడు. మెండ వెంకట రమణమూర్తి ఆ గ్రామంలోని స్వర్ణాంధ్ర పేపర్ మిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాని. అలాగే చిన్నిమల్లి సూర్య ప్రభాకర్‌రావు రాజమండ్రి సమీపంలోని కొంతమూరులో శ్రీసాయి పేపర్ ఎక్యూప్‌మెంట్ అండ్ స్పేర్స్ యజమాని. ఈ ముగ్గురూ ఏకమై 2012–13లో 30 టీపీడీ మోడల్ మిషన్ కొనుగోలుకు రుణం కోసం సిండికేట్ బ్యాంక్‌ను ఆశ్రయించారు. తమకు రూ.9,88,12,136 కావాలని దరఖాస్తు చేసుకున్నారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలు, ఆడిట్ రిపోర్టులను బ్యాంక్‌కు సమర్పించారు. అప్పటి బ్యాంక్ సీనియర్ మేనేజర్ శర్మ వీరికి రుణాలు మంజూరు చేశారు. తద్వారా రూ.6 కోట్ల వరకూ రుణాలు పొందారు. తర్వాత బ్యాంక్ పైఅధికారులకు అనుమానం రావడంతో నిందితులు, వారి కంపెనీలకు సంబంధించిన వివరాలను సేకరించారు. అన్ని నకిలీవి అని తేలడంతో బ్యాంక్ మేనేజర్‌తో పాటు కంపెనీ యజమానులపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో మొదటి నిందితుడు శర్మ 2019 మేలో మృతి చెందారు. దీనితో మిగిలిన వెంకటరమణమూర్తి, సూర్య ప్రభాకరరావు నేరం రుజువు కావడంతో న్యాయమూర్తిపై విధంగా తీర్పు చెప్పారు.

ఉన్నత విద్యలో సంస్కరణలపై సదస్సు

కంబాలచెరువు: తాడితోట జంక్షన్‌లోని సంహిత డిగ్రీ కళాశాలలో సోమవారం ఉన్నత విద్యలో సంస్కరణలు అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఏపీ రాష్ట్ర ఉన్నత విద్య కౌన్సిల్ వైస్ చైర్మన్ కె.రామ్మోహనరావు మాట్లాడుతూ ఉన్నత స్థానాలకు చేరుకోవాలంటే ఆలోచనలు, నైపుణ్యాలు, విధివిధానాలను ఎప్పటికప్పుడు అభివృద్ధి చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ కె.పద్మరాజు మాట్లాడుతూ నైపుణ్యాలను అభివృద్ధి పర్చుకోవడానికి విద్యార్థులకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందన్నారు. ప్రిన్సిపాల్ తోట రామకృష్ణ, ఏవో జి.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీఎంపీల సర్వసభ్య సమావేశం

కంబాలచెరువు: స్థానిక ఎంఎంఆర్ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ది ఏపీ స్టేట్ బేసిక్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ రాష్ట్ర సర్వసభ్య సమావేశం జరిగింది. దీనికి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు లంక సత్యనారాయణ అధ్యక్షత వహించారు. డెల్టా హాస్పిటల్ సీఈవో డాక్టర్ నితిన్, వైద్య నిపుణులు సుమంత్, గీతా శ్రావణ్, రాజగోపాల్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ సలహాదారుడు ఆకాశం గౌరీష్ బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్మ శ్రీనివాస్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కన్నా బత్తుల శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు పక్కుర్తి సత్యనారాయణ పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	:	లాల్‌సలామ్
సూర్యమినీ	:	ఈగల్
సూర్యప్యాలెస్	:	తేరా బాతోన్ మేరీ ఐసా
స్వామి	:	ఈగల్
శివజ్యోతి	:	అంబాజీపేట మ్యారేజీ బ్యాండు
అనుశ్రీ	:	హనుమాన్
రాజా	:	ఈగల్
అశోక	:	ఈగల్
ఊర్వశి	:	యాత్ర – 2
రంభ	:	ఈగల్
మేనక	:	నా సామిరంగ
అప్సర	:	గుంటూరుకారం
కుమారి	:	అంబాజీపేట మ్యారేజీ బ్యాండు
నామవరం		
వీఎస్ మహల్	:	ఈగల్
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	యాత్ర – 2
కడియం		
వెంకటసూర్య	:	ఈగల్